# నేడు ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ పర్యటన

- వలిగొండ, యాదగిరిగుట్ట, మిర్యాలగూడలో రోడ్‌షోలు
- పెద్ద ఎత్తున తరలిరానున్న బీఆర్ఎస్ శ్రేణులు
- గులాబీమయంగా మారిన పట్టణాలు
- 25న భువనగిరికి హరీశ్‌రావు



యాదగిరిగుట్ట టెంపుల్ సిటీపై హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ రమేశ్ తదితరులు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. వలిగొండ, యాదగిరిగుట్ట, మిర్యాలగూడలో జరిగే రోడ్‌షోలో పాల్గొనున్నారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లలో ప్రసంగించనున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి.

**ఉదయం 11గంటలకు వలిగొండకు..**

ఉమ్మడి జిల్లా టూర్‌లో భాగంగా ఉదయం 11గంటలకు వలిగొండలో జరిగే రోడ్‌షోలో పాల్గొనడానికి ఆకాశమార్గాన హెలికాప్టర్‌లో చేరుకుంటారు. ఇప్పటికే వలిగొండ పరిధిలోని లోతుకుంటలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. స్థానిక నేతలు, పోలీసులు హెలిప్యాడ్‌ను పరిశీలించారు. కేటీఆర్ లోతుకుంట నుంచి ప్రచారం రథంపై రోడ్‌షోకు వెళ్తారు. మండలం కేంద్రంలో కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికేందుకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం కేటీఆర్ ప్రసంగిస్తారు. అక్కడి నుంచి తిరిగి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు బయల్దేరుతారు. వలిగొండలో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**మధ్యాహ్నం యాదగిరిగుట్టలో..**

వలిగొండ అనంతరం కేటీఆర్ యాదగిరిగుట్టకు చేరుకుంటారు. కేటీఆర్ టూర్‌కు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. గుట్టలో సైతం హెలిప్యాడ్ సిద్ధం చేశారు. కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికేందుకు పట్టణంలో 10 వేల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం పాత గుట్ట చౌరస్తాలో కేటీఆర్ ప్రసంగిస్తారు. గుట్టలో కేటీఆర్ టూర్‌ను జయప్రదం చేయాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి కోరారు.

యాదగిరిగుట్ట రోడ్‌షోకు 30 వేలు, వలిగొండ రోడ్‌షోకు 20 వేల మంది తరలిరానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే రెండు పట్టణాలు గులాబీమయంగా మారాయి.

**25న భువనగిరికి హరీశ్‌రావు..**

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఈ నెల 25న భువనగిరికి రానున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డికి మద్దతుగా భువనగిరిలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. రాత్రి 7:30 గంటలకు కార్నర్ మీటింగ్‌లో ప్రసంగిస్తారు.

**మిర్యాలగూడలో..**

మిర్యాలగూడ : మిర్యాలగూడలో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. రోడ్‌షోను పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి సాగర్ రోడ్డు మీదుగా రాజీవ్‌చౌక్ వరకు నిర్వహించనున్నారు. రాజీవ్‌చౌక్ వద్ద కేటీఆర్ ప్రసంగించనున్నారు. మిర్యాలగూడ పట్టణం, వేములపల్లి, మాడ్గులపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల నుంచి వేలాదిగా బీఆర్ఎస్ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు.



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట, నవంబర్19 : యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవుదినంతో పాటు కార్తీకమాసం కావడంతో నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, తిరుమాఢవీధులు, గర్భాలయ ముఖ మండపం భక్తులతో కిటకిటలాడాయి. కొండకింద కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ధర్మదర్శనానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం జరిపారు. అనంతరం మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిపారు. మహిళలు దీపారాధనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని సుమారు 38 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.51,36,591ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.

# బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

- ఆ పార్టీ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిక



శాలిగౌరారం : బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

శాలిగౌరారం, నవంబర్ 19 : రాష్ట్రం, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఊట్కూరు, ఆకారం, అంబారిపేటకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నుంచి సుమారు 200 మంది ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణాలు, పల్లెల సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్, రాజు, బీరం నర్సిరెడ్డి, మాగి రవి పాల్గొన్నారు.

# కాంగ్రెసోళ్ల కట్టు కథలను ప్రజలు నమ్మరు

- బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- గుర్రాలదండి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరిక



గుర్రాలదండి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 19 : కాంగ్రెసోళ్లు చెప్పే కట్టు కథలను ప్రజలు నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేయరని బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామానికి చెందిన వివిధ పార్టీల యువకులు భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో గ్రామాలు, పట్టణాలు ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్న విషయం ప్రజలకు తెలుసని అన్నారు. ప్రజలను మోసం చేసి గోస పెట్టారని, మళ్లీ కాంగ్రెస్‌కు ఎలా ఓటు వేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి కండ్ల ముందే కనపడుతుందని, అభివృద్ధి చేసిన పార్టీకి పట్టం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెసోళ్లు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నేను సీఎం అంటే నేను సీఎం అనుకుంటూ ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సొంత డబ్బా కొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఎవరు ఎన్ని మాటలు చెప్పినా బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు సురేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిండు మనసుతో గొంగిడి సునీతను ఆశీర్వదించండి

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- కాంగ్రెస్, హమాలీ సంఘం నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్19 : నిండు మనసుతో బీఆర్ఎస్ ఆలేరు అభ్యర్థి, ఎమ్మెల్యే గొంగిడి సునీతను ఆశీర్వదించి మూడోసారి అసెంబ్లీకి పంపాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి కోరారు. ఆలేరు నియోజకవర్గాన్ని రూ.5వేల కోట్లతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని తెలిపారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో మోటకొండూర్‌కు చెందిన 50 మంది హమాలీ సంఘం నాయకులు, మాటూరు, పెద్దబావి నుంచి 100 మంది కాంగ్రెస్ నాయకులు, ఇక్కుర్తి చెందిన 50 మంది, బొమ్మలరామారం నుంచి 100 మంది, చీకటిమామిడికి చెందిన 100 మంది, రాజాపేట మండలం కుర్రారం నుంచి 50 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కరెంట్ కష్టాలు మళ్లీ వస్తాయన్నారు. బీజేపీ వస్తే కులాలు, మతాల మధ్య మంటలు చెలరేగుతాయని పేర్కొన్నారు. 50 ఏండ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలోనే చేసి చూపించిందన్నారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకే అవకాశం ఇవ్వాలని కోరారు. మోటకొండూర్ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఇల్లందుల మల్లేశ్‌గౌడ్, సర్పంచ్ అమరేందర్‌రెడ్డి, బొమ్మలరామా రం పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య పాల్గొన్నారు.